క్లుప్తంగా

తూటికాడ కషాయంపై అవగాహన



కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

బలిజిపేట: మండలంలోని మిర్తివలసలో ఐసీ ఆర్పీలు ఆదిలక్ష్మి, తిరుపతిరావు తూటికాడ కషాయం తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 20 లీటర్ల గోమూత్రంలో 10 కిలోల తైటి ఆకులను వేసి బాగా మరిగించాలన్నారు. తర్వాత రోజున వడకట్టి వచ్చిన కషాయాన్ని 100 లీటర్ల నీటిలో 8 లీటర్ల వేసి పిచికారీ చేస్తే దోమ, సుడిదోమ వంటివి నివారించబడతాయన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

యువకుల నిజాయితీ



ఆర్పీఎఫ్ సిబ్బందికి బ్యాగ్ అప్పగిస్తున్న యువత

పార్వతీపురం టౌన్: తమకు దొరికిన బ్యాగ్‌ను రైల్వే పోలీసులకు అప్పగించి యువకులు తమ నిజాయితీ చాటుకున్నారు. అబాలాసింగ్ శ్రీను, గొల్ల ప్రశాంత్, జమ్ము మురళి శనివారం రైలులో విశాఖపట్నం నుంచి పార్వతీపురం వస్తుండగా.. వారికి ఓ బ్యాగ్ దొరికింది. వెంటనే ఆ బ్యాగ్‌ను పార్వతీపురం రైల్వే పోలీసులకు అప్పగించారు. దీంతో ఆర్పీఎస్ సిబ్బంది ఆ యువకులను అభినందించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి

- ఎస్సై రాజేష్



బ్రీత్ అనలైజర్‌తో తనిఖీలు చేస్తున్న ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనచోదలకు సహకరించాలని ఎస్సై ఎం. రాజేష్ అన్నారు. మండల కేంద్రంలోని హనుమాన్ జంక్షన్ వద్ద ఆదివారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం మత్తు, మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

కళాకారులకు సత్కారం



మహిళా కళాకారులకు చీరలు అందిస్తున్న కృష్ణారావు దంపతులు

భామిని: మండల కేంద్రంలో దేవీ నవరాత్రులు సందర్భంగా కోలాటం ప్రదర్శన చేసిన కళాకారులకు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కొట్టుగుమ్మడి కృష్ణారావు దంపతులు ఆదివారం సత్కరించారు. మహిళా కళాకారులకు చీర, పసుపు, కుంకుమ ఇచ్చి అభినందించారు. శరన్నవరాత్రి వేడుకల్లో దేవీ మండపం వద్ద కళాకారులు కోలాటం ఆడి వీక్షకులను ఉత్సాహపరిచారు.

ఎంపీడీఓగా రమేష్

జియ్యమ్మవలస: మండల ఎంపీడీఓ(ఎఫ్ఏసీ)గా ఎస్.రమేష్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన కొమరాడ మండలంలో ఏఓగా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందేందుకు కృషిచేస్తానన్నారు.

నేటి నుంచి 'పల్లె పండుగ'

మండలంలో సోమవారం నుంచి 'పల్లె పండుగ' కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమేష్ తెలిపారు. ఉదయం 9 గంటలకు టీకేజమ్ము, 10 గంటలకు పీటీమండ, 11 గంటలకు అలమండ, మధ్యాహ్నం 2 గంటలకు అర్నాడ, సాయంత్రం 4 గంటలకు శిఖబడిలో పల్లె పండుగ కార్యక్రమాలు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

మాలతమ్మకు మకరతోరణం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలం గొటివాడ పంచాయతీ నేరేడువలసలో వెలసిన మాలతమ్మ తల్లి విగ్రహానికి ఆలంకరించేందుకు రూ.50 వేలు విలువ చేసే మకర తోరణాన్ని కురుపాంకు చెందిన వ్యాపారులు పాట్నూరు రవికుమార్, వూళ్ల సురేష్, రమేష్ వితరణ చేశారు. దసరా పండగను పురస్కరించుకుని శనివారం ఈ మకరతోరణాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

రైతన్నను ఆదుకోవాలి..

- వరి పంటను నాశనం చేస్తున్న ఏనుగులు
- పరిహారం చెల్లించాలంటున్న అన్నదాతలు



వెంకటరమణ పొలంలో ధ్వంసమైన వరి పంట

సీతానగరం: ఏనుగులు ధ్వంసం చేసిన వరి పంటకు సంబంధించి బాధితులకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. మండలంలోని గుచ్చిమి పంచాయతీ మధుర గ్రామమైన తాన్న సీతారాంపురంలో ఐదు రోజులుగా ప్రజలకు కంటి మీద కునుకు ఉండడం లేదు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు పూత దశలో ఉంది. అయితే ఏనుగుల గుంపు తాన్న సీతారాంపురం, రేపటివలస కొండ మధ్యలో సంచరిస్తూ వరి పంటను ధ్వంసం చేస్తున్నాయి. వాటివల్ల ఎటువంటి హానీ జరగకుండా ఉండేందుకు అటవీశాఖ అధికారులు కేర్ టేకర్లను నియమించింది. అయినప్పటికీ ఏనుగులు వరిపైర్లను నాశనం చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తాన్న వెంకటరమణకు చెందిన 80 సెంట్లు, తాన్న సత్యనారాయణ 50 సెంట్లు, తాన్న శ్రీహరి 50 సెంట్లు, టి.రామినాయుడు 50 సెంట్లు, ఎం. సత్యనారాయణకు చెందిన ఎకరా పొలంలో ఏనుగులు వరి పంటను నాశనం చేశాయి. అధికారులు నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందేలా చూడాలని బాధితులు కోరుతున్నారు. ఇదే విషయాన్ని అటవీశాఖ బీట్ ఆఫీసర్ రుషీకేష్ వద్ద ప్రస్తావించగా, బాధితులకు పరిహారం చెల్లించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



తాన్న సీతారాంపురం తోటల్లో ఏనుగుల గుంపు

పరిహారం ఇవ్వాలి..



ఏడాది పొడవునా కుటుంబానికి అవసరమైన తిండి గింజలు పండించడానికి మదుపులు పెట్టి వ్యవసాయం చేశాను. పూత దశలో ఉన్న వరి చేనును ఏనుగులు ధ్వంసం చేశాయి. అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి.

– తాన్న వెంకటరమణ, బాధిత రైతు, టి. సీతారాంపురం

'ఉమ్మడి పోరాటం అవసరం'

పార్వతీపురం టౌన్: మండలంలోని బడిదేవర కొండను అక్రమ గ్రానైట్ తవ్వకాల నుంచి రక్షించుకోవడానికి ఉమ్మడి పోరాటం అవసరమని గిరిజన సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రజిత్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, 2016 సంవత్సరంలో జరిగిన తవ్వకాల ప్రయత్నాన్ని ఉమ్మడి పోరాటం ద్వారా అడ్డుకోగలిగామని గుర్తు చేశారు. ప్రస్తుతం వివిధ సంఘాలు, పార్టీల నాయకులు ఎవరికి వారు ఒంటరి ప్రయాణం చేయడం వల్ల అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నామని అభిప్రాయపడ్డారు. ఆ ప్రాంతంలో ప్రజలు సైతం వివిధ పార్టీలుగా, వర్గాలుగా విడిపోయారని, వారిని సంఘటితం చేయాల్సిన అవసరం ఉందన్నారు. 2016లో 'గ్రానైట్ తవ్వకాల వ్యతిరేక పోరాట కమిటీ ద్వారా అనేక పోరాటాలు చేశామని, దివంగత సీపీఎం నేత రెడ్డి శ్రీరామ్మూర్తితో సహ అనేక మంది పోరాట కమిటీ నాయకులు అక్రమ కేసులు ఎదుర్కొన్నామని గుర్తు చేశారు. కావున ఇప్పటికైనా బడిదేవర కొండ రక్షణ కోసం కలిసి వచ్చే వారందరూ ఐకమ్యతంతో పోరాటం చేయాల ని పిలుపునిచ్చారు.

భక్తిశ్రద్ధలతో విజయదశమి

దసరా (విజయ దశమి) పండగను వాడవాడలా భక్తిశ్రద్ధలతో శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వాహనాలకు పూజలు నిర్వహించి, అందంగా ముస్తాబు చేశారు. ఇళ్లల్లో పిండివంటలు చేసి అందరూ ఆనందంగా గడిపారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాలను ఆదివారం మేళ తాళాల నడుమ ఊరేగిస్తూ నిమజ్జనం చేశారు.

– సీతానగరం/పార్వతీపురం టౌన్/బలిజిపేట/సాలూరు



పార్వతీపురం టౌన్: రాజరాజేశ్వరి అవతారంలో కొత్తవలస దుర్గమ్మ



సాలూరు: దసరా సందర్భంగా ప్రత్యేక అలంకరణలో పంచముఖేశ్వర స్వామి



సీతానగరం : తిరువీధిలో పూజలందుకుంటున్న దుర్గాదేవి



బలిజిపేట: అబ్బాడలో అమ్మవారిని ఊరేగిస్తున్న గ్రామస్తులు

ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం

- ఎమ్మెల్యే విజయ్‌చంద్ర



చౌక ధరల దుకాణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

పార్వతీపురం టౌన్: ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేరుస్తున్నామని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర అన్నారు. పట్టణంలోని పేదలకు చౌకధరల దుకాణం ద్వారా ఆయిల్ పంపిణీ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదవాళ్లకు తక్కువ ధరకే బియ్యం, పంచదార, ఆయిల్, కందిపప్పు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పల్లె పండుగ'

పాకొండ రూరల్: మండలంలో సోమవారం నుంచి 'పల్లె పండగ' కార్యక్రమం ప్రారంభించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మురళి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు పేర్కొన్నారు. టీకే రాజపురం వయా తలవరం మీదుగా టీడీ పారాపురం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు సోమవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అలాగే అర్లతి, పద్మాపురం గ్రామలకు సంబంధించిన రహదారి పనులకు శంకుస్థానలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

- **గుమ్మలక్ష్మీపురం:** మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ ఎస్.కే పాడు అడ్వంచర్ పార్క్ వద్ద 'పల్లె పండగ' కార్యక్రమం కింద మంజూరైన సీసీరోడ్డు పనులకు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సోమవారం శంకుస్థాపన చేస్తారని మండల పరిషత్ ఇంజినీరింగ్ అధికారి కె.మురళీధర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఈ రోడ్డు నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు.

జీబీ అప్పారావుకు నివాళి



జీబీ అప్పారావుకు నివాళి అర్పిస్తున్న కొప్పల వెలమ సంక్షేమ సంఘ సభ్యులు

సాలూరు: దివంగత స్వాతంత్ర్య సమరయోదుడు గొర్రెపాటి బుచ్చిఅప్పారావు జీవితం ఎందరికో ఆదర్శమని కొప్పలవెలమ సంక్షేమ సంఘం నాయకులు కొనియాడారు. జి.బి.అప్పారావు 111వ జయంతిని సాలూరు పట్టణంలో ఆదివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బుచ్చిఅప్పరావు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన కృషి ఫలితంగానే తాటిపూడి రిజర్వాయర్, గోస్తనీ నదిపై కాజ్‌వే నిర్మాణం జరిగాయని వివరించారు. ఆయన సేవలకు గుర్తింపుగా తాడిపూడి రిజర్వాయర్‌కు గొర్రెపాటి బుచ్చిఅప్పారావు పేరు పెడుతూ గత ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ జీవోను రద్దు చేయడాన్ని వారు తప్పుపట్టారు. వెంటనే తాటిపూడి రిజర్వాయర్‌కు ఆయన పేరును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

మద్యం అమ్మకాలపై ఉన్న శ్రద్ధ హామీల అమలుపై లేదు

- కూటమి ప్రభుత్వం తీరుపై మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే కళావతి



వీరఘట్టం: కూటమి ప్రభుత్వానికి మద్యం అమ్మకాలపై ఉన్న శ్రద్ధ సూపర్-6 అమలుపై లేదని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. ఆదివారం ఆమె వండువలో మీడియాతో మాట్లాడారు. ఎంత సేపు మద్యం.. మద్యం.. మద్యం అంటూ జపం చేస్తున్నారే తప్ప ప్రజలకు ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల హామీలను నెరవేర్చకుండా ప్రజలను మళ్లీ మోసగించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భారీ స్కెచ్ వేస్తున్నారని కళావతి అన్నారు. ప్రజలకు సూపర్-6 అంటూ హామీలు ఇచ్చాం, ఇప్పుడు ఆ హామీలను చూస్తే భయమేస్తోందని ఆ మధ్యన అసెంబ్లీ సాక్షిగా సీఎం చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనపై ప్రజలు దుమ్మెత్తిపోయడంతో ఆ విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని విమర్శించారు. ఎన్నికల హామీలు అమలు చేయలేమన్నప్పుడు ప్రజలకు ఎందుకు మీరు మోసపూరితమైన హామీలు ఇచ్చారని ప్రశ్నించారు. 2014 ఎన్నికలకు ముందు సుమారు ఆరు వందలకు పైగా హామీలను మేనిఫెస్టోలో పెట్టి గెలిచిన వెంటనే మేనిఫెస్టోను మాయం చేసిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కిందన్నారు. మళ్లీ ఇప్పుడు అధికారం చేపట్టిన తర్వాత 2014 మాదిరిగానే హామీలను తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

'అమ్మకు వందనం' వస్తుందని ఎన్నో ఆశలతో మీకు ఓట్లు వేసిన తల్లులకు పంగనామం పెట్టారని, ఉచిత గ్యాస్ సిలెండ్లు వస్తాయని ఎదురుచూసిన మహిళలకు గుండెలో మంటలు పెట్టారని, ఉచిత బస్సు ప్రయాణం అని ఊదరగొట్టి చివరకు ఎటూ తేల్చకుండా మహిళలకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని దుయ్యబట్టారు. ఎన్నికల హామీలు కూటమి ప్రభుత్వం నెరవేర్చేలా ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో అక్రమాలు, అరాచకాలు పేట్రేగిపోతున్నాయని, ఆడవారి మానప్రాణాలకు రక్షణలేకుండా పోయిందన్నారు. నాటి బ్రిటిష్ పాలన కంటే ఘోరంగా రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయన్నారు.

భయపెడుతున్న గ్రామసింహాలు..

- గుంపులు గుంపులుగా సంచారం
- కనబడిన వారిపై దాడి
- బెంబేలెత్తుతున్న ప్రజలు



వెంగాపురంలో సంచరిస్తున్న కుక్కలు

బలిజిపేట: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా కనిపిస్తున్న గ్రామసింహాలను చూసి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చికెన్, మటన్ దుకాణాల నిర్వాహకులు పారబోస్తున్న వ్యర్థాలను తిని మాంసాహారానికి బాగా అలవాటయ్యాయి. ఈ పరిస్థితుల్లో కనబడిన మనుషులపై దాడులకు తెగబడుతున్నాయి. ముఖ్యంగా చిన్నారులపై దాడులు చేస్తుండడంతో ప్రజలు భయపడుతున్నారు. అలాగే మేకలు, గొర్రెల శాలల్లోకి కూడా ప్రవేశించి మూగజీవాలను సైతం కరిచి చంపేస్తున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో మండలంలో కుక్క కాటు బాధితులు ఎక్కువయ్యారు. దీన్ని బట్టి చూస్తుంటే కుక్కల స్వైరవిహారం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అధికారులు స్పందించి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉంటే కుక్కల దాడి నుంచి తప్పించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులు వివరిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- కుక్క దగ్గరికి వస్తే ఏ మాత్రం కదలకుండా నిలబడి ఉండడం ఉత్తమం. ఎట్టి పరిస్థితిల్లోనూ పరిగెత్తరాదు. కుక్కల కళ్లలోకి తదేకంగా చూడరాదు. వాటి పిల్లల దగ్గరికి వెళ్లరాదు. తల్లికుక్క కరిచే ప్రమాదం ఉంది.
- నిద్రిస్తున్నప్పుడు, తింటున్నప్పుడు, పిల్లలకు పాలిస్తున్నప్పుడు వాటిని కర్రలు, రాళ్లతో కొట్టడం చేయకూడదు.
- ఒకవేళ కుక్క దాడి చేస్తే ముఖాన్ని చేతులతో కప్పుకోవాలి. ముఖాన్ని కరిస్తే ఇన్‌ఫెక్షన్ మెదడుకు త్వరగా సోకుతుంది.
- కుక్క కోపంగా దగ్గరికి వస్తే నేలవైపు చూస్తూ దానికి దూరంగా మెల్లగా నడవాలి.
- ఒకవేళ కుక్క కరిస్తే గాయాన్ని బాగా సబ్బుతో కడుక్కోవాలి.

అందుబాటులో వ్యాక్సిన్

కుక్కకాటుకు వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. ఎవరికి ఎప్పుడు కుక్కలు కరిచినా వెంటనే బలిజిపేట పీహెచ్‌సీకి వస్తే వ్యాక్సిన్ వేస్తాం. నెలకు సుమారు 40 వరకు కుక్కకాటు బాధితులు వస్తున్నారు.

– క్రాంతి కిరణ్మయి, వైద్యాధికారి, బలిజిపేట పీహెచ్‌సీ.

దోమ కాటుతో పాడికి చేటు



- అనారోగ్యం పాలవుతున్న పాడిపశువులు
- అవగాహన పెంచుకోకపోతే పశుసంపదకు నష్టం

పాలకొండ రూరల్: దోమల కారణంగా మనుషులే కాదు పశువులు కూడా అనారోగ్యం పాలవుతాయి. ఈ పరిస్థితిని ముందుగానే అధిగమిస్తే మూగజీవాలను ఆరోగ్యవంతంగా చూసుకోవచ్చు. అకాల వర్షాలు కురుస్తుండడంతో పల్లపు ప్రాంతాలు, ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమకాటు వల్ల మనుషులతో పాటు పశువులు కూడా రోగాల బారిన పడతాయి. దీంతో పశువులలో పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. ఒక్కోసారి పశువులు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. పాలకొండ నియోజకవర్గంలో పాడిసంపదకు కొదవలేదు.ఆవులు,గేదెలు 22వేల పైచిలుకు ఉన్నాయి. ప్రస్తుత సీజన్‌లో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోకపోతే పాడిపశువులు గొంతు వ్యాపు, దొమ్ము, గాలికుంటు తదితర వ్యాధుల బారినపడే అవకాశం ఉంది. పశువుల్లో వ్యాధి లక్షణాలను గుర్తించిన వెంటనే పశువైద్య సిబ్బందిని సంప్రదించి సరైన చికిత్స అందివ్వాలని వైద్యులు సూచిస్తున్నారు.

దోమకాటుతో వచ్చే సమస్యలు

- పశువులను దోమలు ఎక్కువగా కుట్టడంతో అవి మేత సరిగా తీసుకోకపోవడంతో పాటు ఆకలి మందగించటం జరుగుతుంది. ఈ ప్రభావంతో పాల దిగుబడి తగ్గిపోతుంది.
- పశువు శరీర ఉష్ణోగ్రత పెరిగిపోవడంతో రోజురోజుకు బలహీనపడుతుంది.
- దోమలు కుట్టినచోట పుండ్లు ఏర్పడతాయి.
- పశువులకు మేత వేసే ప్రాంతం అంతా శుభ్రంగా లేకుంటే దోమలు చేరి పశువులు మేత తినే సమయంలో వాటిని బాధిస్తాయి. దీంతో మేత కూడా సరిగ్గా తీసుకోలేవు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పశువులను ఉంచే పాకలో దోమలు ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దోమ తెరలు వాడటం శ్రేయస్కరం. సాయంత్రం పశువులను పాకలో కట్టే ముందు వేప ఆకులు లేదా సాంబ్రాణితో పొగ పెట్టాలి. పశువుల శాలల చుట్టూ వ్యర్థాలు, పొదలు లేకుండా శుభ్రం చేసుకోవాలి. పశువులు కట్టేసిన ప్రాంగణాన్ని రోజూ శుభ్రం చేసుకోవాలి.

అపరిశుభ్రతతో సమస్య

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పాడి రైతులు తగు జాగ్రత్తలు పాటించాలి. పశువుల పాకలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మేత, దాణాకు అందించే పాత్రలు శుభ్రం చేయాలి. వైద్యుల సలహా మేరకు ఎప్పటికప్పుడు అవసరమైన టీకాలు, మందులు అందించాలి. దోమకాటు వలన ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడే అవకాశాలున్నాయి. పశువులకు సంక్రమించే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పశువైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పాడిరైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

– ప్రభా మాణిక్యరావు, పశుసంవర్ధకశాఖ ఏడీ, పాలకొండ

ఉత్సాహంగా క్రికెట్ టోర్నీ

పాలకొండ రూరల్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శని, ఆదివారాల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించి క్రికెట్ టోర్నీలో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ఛాలంజింగ్ కప్ ఫైనల్స్‌లో పాలకొండ-వీరఘట్టం జట్లు తలపడగా పాలకొండ జట్టు విజేతగా నిలిచింది.

ఈ కార్యక్రామనికి ముఖ్య అతిథిగా స్థానికుడు, ప్రస్తుత కడప జిల్లా అటవీశాఖాధికారి టి.రాజశేఖర్, ఉద్యోగ సంఘాల నాయకుడు ఎస్.భరత్‌భూషణ్‌రాజు, ఉత్తమ ఉపాధ్యాయులు కె.జనార్దనరావుతో పాటు పలువురు సచివాలయ ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అటవీశాఖాధికారి రాజశేఖర్‌ను క్రీడాకారులు సన్మానించారు.

విరాళం అందజేత

భామిని: మండలంలోని తివ్వ కొండపై వెలసిన కోటకొండ దుర్గమ్మ మందిర నిర్మాణానికి గుమ్మలక్ష్మిపురం మండలం జి.శివడ వీఆర్ఓ నిమ్మల లక్ష్మీనారాయణ రూ.50 వేలు, ఎల్విన్‌పేట పీసీ జన్ని గణప్రసాద్ రూ.20 వేలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. మందిరం నిర్మాణానికి తమవంతు సహకారం అందిస్తామని దాతలు తెలిపారు.